క్లుప్తంగా

క్వారీ ప్రాంతం పరిశీలన



క్వారీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మైన్స్‌అధికారులు

రావికమతం: మరుపాక గ్రామంలో సర్వే నంబరు 258లో ఎనిమిది ఎకరాల్లో క్వారీ ఏర్పాటుకు అప్పారావు అనే వ్యక్తి దరఖాస్తు చేసుకున్న ప్రాంతాన్ని అనకాపల్లి మైన్స్ ఆర్‌ఐ స్వాతి బుధవారం పరిశీలించారు. ఇటీవల క్వారీ ఏర్పాటుకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రస్తుతం ఆ భూముల పరిస్థితిని ఆర్‌ఐ స్వాతి పరిశీలించారు. రెవెన్యూ అధికారులు తప్పుడు సర్వే ఇచ్చారని, అందువల్ల పూర్తి స్థాయిలో పరిశీలించాలని ఈ ప్రాంత రైతులు పలువురు ఆమెకు వినతిపత్రం అందజేశారు.

రామచంద్రాపురానికి పక్కా రోడ్డు



రామచంద్రాపురానికి నిర్మించిన పక్కా రోడ్డు

మాడుగుల: నియోజకవర్గ కేంద్రం మాడుగులకు సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఉన్న గిరిజన గ్రామం రామచంద్రాపురానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు కృషి ఫలితంగా పక్కా రోడ్డు నిర్మాణం పూర్తి అయింది. గతంలో మాడుగుల రావాలంటే కొండ, గెడ్డలు దాటుకుని బురదలో రావలసి వచ్చేదని గ్రామానికి చెందిన గిరిజనులు తెలిపారు. మాడుగుల గ్రామానికి చెందిన సుమారు 500 కుటుంబాలకు ఈ రోడ్డు పక్కనే జగనన్న ఇళ్లు మంజూరు చేశారు. వారికి కూడా ఈ రోడ్డు ఉపయోగపడుతుంది. దీంతో కాలనీ వాసులు, రైతులు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎంపీడీవో శచీదేవికి సన్మానం



సన్మానించి, జ్ఞాపిక అందజేస్తున్న ఎంఈవో మధుమూర్తి, ఉపాధ్యాయులు

కె.కోటపాడు: గణతంత్ర దినోత్సవం నాడు ఉత్తమ ఎంపీడీవోగా అవార్డు స్వీకరించిన ఎంపీడీవో శచీదేవిని ఎంఈవో టి.మధుమూర్తి, ఉపాధ్యాయులు బుధవారం సన్మానించారు. ఎంపీడీవో కార్యాలయంలో శచీదేవిని దుశ్శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు సూర్రెడ్డి శ్రీనివాసరావు, బి.పేరునాయుడు, రాజాపంతుల సురేష్, పోతల నాయుడు, అబద్దం పాల్గొన్నారు.

గరిష్ట వేతనం పొందేలా ఉపాధి పనులు



ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఏపీవో వసంత్ కుమార్

కె.కోటపాడు: వేతనదారులు రోజూ గరిష్ట వేతనం రూ.257 పొందేలా గ్రామాల్లో ఉపాధి పనులను నిర్వహించాలని ఏపీవో వసంత్‌కుమార్ తెలిపారు. సూదివలస గ్రామంలోని కొత్త చెరువులో జరుగుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వేతనదారులతో ఆయన మాట్లాడారు. మండలంలో 32 పంచాయతీల్లో పనులను ప్రారంభించినట్టు ఆయన చెప్పారు. మండలంలో జాబ్‌కార్డులు గల 9,120 మంది పనులకు హాజరుకావాలన్నారు. ప్రస్తుతం మండలంలో జరుగుతున్న ఉపాధి పనులకు 2050 మంది రోజువారీగా హాజరు అవుతున్నట్టు ఏపీవో తెలిపారు.

నేడు ఉచిత వైద్య పరీక్షలు

రోలుగుంట: స్థానిక సురక్ష నర్సింగ్ హోమ్ వద్ద గురువారం ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు సత్య తెలిపారు. బీపీ, సుగర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహిస్తామని చెప్పారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి విజయానికి కృషి చేయాలి

• ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



పార్టీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీచేస్తున్న సీతంరాజు సుధాకర్ విజయానికి పార్టీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలపై నియోజవర్గంలోని ఎంపీపీలు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, పార్టీ ముఖ్య నాయకులతో క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపును పార్టీనాయకులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలన్నారు.

గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుసుకుని పార్టీ అభ్యర్థి గెలుపునకు దోహదపడే విధంగా చూడాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను అధిష్టానం ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, వైస్‌చైర్మన్లు గొలుసు నర్సింహమూర్తి, తమరాన అప్పలనాయుడు, మున్సిపాలిటీ సచివాలయాల కోఆర్డినేటర్ తమరాన శ్రీనివాస్, ఎంపీపీలు సాగిన లక్ష్మణమూర్తి, గజ్జలపు మణికుమారి, జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, పార్టీ టౌన్ అధ్యక్షులు ఏకా శివ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు సుర్ల సత్యనారాయణ, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట

– ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పురుషుల కంటే మహిళలే అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ నిర్వహించనున్న స్టార్ వనిత, పరిపూర్ణ మహిళ పోటీల ప్రచార పోస్టర్లను ఎమ్మెల్యే బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని చెప్పారు. మంత్రివర్గంలోనూ, నామినేటెడ్ పదవుల్లో మహిళలకు అగ్రస్థానం కల్పించారన్నారు. మహిళా సంక్షేమానికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని చెప్పారు. సంక్షేమ పథకాలు మహిళల పేరున మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకుని రాణించాలన్నారు. ఎల్‌ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ పోటీలు నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. ఫెడరేషన్ నాయకులు దేవాడ సత్యనారాయణ మాట్లాడుతూ మహిళల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. గెలుపొందిన వారికి రూ.10 వేల నుంచి రూ.6 వేల వరకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, కౌన్సిలర్లు వీరమాచినేని జగదీశ్వరి, కోనేటి రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, వైఎస్సార్‌సీపీ నాయకుడు యాదిగిరి శేషు, ఏఎల్‌పురం సర్పంచ్ ఎల్.సుజాత, ఏఎంసీ డైరెక్టర్ లోకవరపు శారద తదితరులు పాల్గొన్నారు.

14న మోదకొండమ్మ తీర్థం



మోదకొండమ్మ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ తీర్థాన్ని వచ్చే నెల 14న నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. భారీ విద్యుత్‌దీపాల అలంకరణ, నేల వేషాల నడుమ తీర్థం వైభవంగా జరపనున్నట్టు ఆయన చెప్పారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న నాసా, దళిత నేతలు

మాకవరపాలెం: మండలంలోని జి.నగరంలో దళిత కుటుంబాలకు నాసా సంస్థ నిత్యావసర సరకులను పంపిణీ చేసింది. గత నెల 16న ఈ గ్రామంలో ఎస్సీ, బీసీ వర్గాల మధ్య గొడవ జరిగిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇరువర్గాల నుంచి 20 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బుధవారం తొమ్మిది దళిత కుటుంబాల వారికి నాసా సంస్థ కో ఆర్డినేటర్ తాటిపాక శ్రీను, ప్రతినిధి జి.గోపీ నిత్యావసర సరకులతో పాటు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు.ఈ కార్యక్రమంలో దళిత ప్రగతి ఐక్యవేదిక అధ్యక్షుడు కె.మరిడియ్య, దళిత కులాల ఐక్య వేదిక కన్వీనర్ చలపతి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా డ్రైనేజీల నిర్మాణ పనులు



మాడుగుల రాజవీధిలో నిర్మిస్తున్న డ్రైనేజీ

మాడుగుల: మండల కేంద్రం మాడుగులలో డ్రైనేజీల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. గ్రామంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీలను గత నెల గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలు నాయుడు పరిశీలించారు. గ్రామంలో అన్ని డ్రైనేజీలను నిర్మించాలని ఆదేశిస్తూ ఆ బాధ్యతను ఎంపీపీ రామధర్మజకు అప్పగించారు. దీంతో డ్రైనేజీల పనులు జోరుగా సాగుతున్నాయి.

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు



విద్యార్థులకు సూచనలు చేస్తున్న స్టూడెంట్ కౌన్సెలర్ శంకర్ ప్రసాద్

నర్సీపట్నం: పదవ తరగతి విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని భీమునిపట్నం డైట్ కళాశాల అధ్యాపకులు జె.మాధవి తెలిపారు. పరీక్ష పర్వ్ కార్యక్రమంలో భాగంగా పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. పరీక్షలకు 45 రోజుల సమయం ఉన్నందున ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా చదవాలన్నారు. ఇందుకు తగిన సూచనలు, సలహాలు చేశారు. అనంతరం స్టూడెంట్ కౌన్సెలర్ ఎం.శంకర్ ప్రసాద్ మాట్లాడుతూ తగిన విశ్రాంతి, మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని చెప్పారు. ఉపాధ్యాయుల సూచనలను పరిగణలోకి తీసుకుని సమయాన్ని బట్టి ప్రణాళికబద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ప్రిన్సిపాల్ పి.శివప్రసాద్, ఉపాధ్యాయులు జి.వి.సత్యనారాయణ, బి. కృష్ణారావు, కె.లక్ష్మీనారాయణ విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

కార్మిక చట్టాలపై అవగాహన అవసరం



ఇటుకల బట్టీలను పరిశీలిస్తున్న నర్సీపట్నం లేబర్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు

గొలుగొండ: ఇటుకల బట్టీలు నిర్వహిస్తున్న అందరికీ కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలని, బాల కార్మికులతో పనులు చేయించరాదని నర్సీపట్నం లేబర్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు తెలిపారు. చోద్యం,లింగంపేట, కృష్ణదేవిపేట, చీడిగుమ్మల గ్రామాల్లో ఉన్న పెంట్రోల్ బంక్‌లు, ఇటుకల బట్టీలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా యజమానులతో మాట్లాడుతూ బాల కార్మికులతో పనులు చేయిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

18న జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలు

రోలుగుంట: మండలంలోని కొండపాలెంలో పోతురాజుబాబు పండగ సందర్భంగా ఈనెల 18న జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పోటీలు నిర్వహించనున్నట్టు గ్రామ ఉప సర్పంచ్ బంటు చిరంజీవి తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.10 వేలు. ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు, తృతీయ బహుమతిగా రూ.6 వేలు, నాల్గవ బహుమతిగా రూ.4 వేల నగదు అందజేయనున్నట్టు చెప్పారు. విజేతలకు మినహా మిగిలిన పోటీదారులకు రవాణా చార్జీలు అందజేస్తామని, మరింత సమాచారం కోసం ఫోన్ నంబర్ 9640990978లో సంప్రదించాలని తెలిపారు.

మెరుగైన వైద్యసేవలకు 20 మంది తరలింపు



కె.జె పురం నుంచి బయలుదేరిన రోగులు

మాడుగుల రూరల్: మెరుగైన వైద్య సేవల కోసం కేజే పురం నుంచి 20 మంది దీర్ఘకాలిక రోగులను తగరపువలస సమీపంలోని అనిల్ నీరుకొండ ఆస్పత్రికి తరలించినట్టు స్థానిక భానోదయ రూరల్ డెవలప్‌మెంటు సొసైటీ వ్యవస్థాపక చైర్మన్ ఆర్.రామ కొండలరావు తెలిపారు. గతంలో నాలుగు సార్లు గ్రామంలో శిబిరాలు నిర్వహించి, గుర్తించిన రోగులను తరలించినట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో రమణబాబు తదితరులుపాల్గొన్నారు.

ఆశాజనకంగా జీడిమామిడి కాపు



చంద్రయ్యపాలెం ప్రాంతంలో జీడి కాపు

గొలుగొండ: మండలంలో జీడిమామిడి తోటల కాపు ఆశాజనకంగా ఉంది. వాతావరణం అనుకూలంగా ఉండడంతో ప్రస్తుతం చంద్రయ్యపాలెం, బుడ్డడపాడు, అమ్మపేట, కరక తదితర ప్రాంతాల్లో జీడి పిక్కల కాపు ప్రారంభమైంది. సుమారు నాలుగు వేల ఎకరాల్లో ఈ తోటలున్నాయి. వరి తరువాత రైతులు ఈ పంటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. అన్ని ప్రాంతాల్లో కాపు బాగుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

గొడిచర్ల పీహెచ్‌సీకి ఈసీజీ మిషన్ వితరణ



ఆస్పత్రి వైద్యునికి ఈసీజీ మిషన్‌ను అందజేస్తున్న డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి

నక్కపల్లి : గొడిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి హెటిరో గ్రూప్ ఆఫ్ కంపెనీస్ యాజమాన్యం ఈసీజీ మిషన్‌ను విరాళంగా అందజేసింది. సుమారు లక్షరూపాయల విలువైన ఈ మిషన్‌ను కంపెనీ చైర్మన్ బండి పార్థసారథి విరాళంగా సమకూర్చినట్టు కంపెనీ డీజీఎంలు సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి తెలిపారు. బుధవారం ఈ మిషన్‌ను వారు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కు అందజేశారు. డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ మండలంలో సుమారు 20 మెరక గ్రామాల ప్రజలకు గొడిచర్ల పీహెచ్‌సీ ద్వారా వైద్య సేవలు అందుతున్నాయన్నారు. ఆస్పత్రికి ఈసీజి మిషన్‌ను విరాళంగా అందజేసిన హెటిరో చైర్మన్ పార్థసారథిరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. విద్యార్థులకు, ప్రజలకు అవసరమైన సదుపాయాల కల్పనకు తమ సంస్థ ఎండీ ఇతోధికంగా సాయం అందిస్తున్నారని సుబ్బారెడ్డి, కుళ్లాయిరెడ్డి తెలిపారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



ఆంజనేయస్వామిని దర్శించుకున్న నాయకులు

పాయకరావుపేట : పాల్తేరు గ్రామంలో అభయ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి మూడేళ్లు పూర్తయిన సందర్భంగా 3వ వార్షికోత్సవ పూజా కార్యక్రమాలు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఘనంగా అన్నసమారాధన జరిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు దేవవరపు సూర్యచక్రం, పార్టీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, ఎంపీటీసీ ఇసరపు సత్యనారాయణ తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

అప్పన్నపాలెంలో...

రాంబిల్లి : అప్పన్నపాలెంలో బుధవారం ఆంజనేయస్వామి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ఆంజనేయస్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు మరిడిమాంబ జాతర

అనకాపల్లిటౌన్ : స్థానిక విజయరామరాజుపేటలో మరిడిమాంబ అమ్మవారి జాతర మహోత్సవం గురువారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఆ రోజు ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభి షేకాలు జరగనున్నాయి. అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చే అవకాశాలుండటంతో ముందస్తు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. తెల్లవారుజామున నగర సంకీర్తన, 9 గంటలకు భక్తిసుధ భక్తిగీతాలాపన, సాయంత్రం కనులు మిరుమిట్లు గొల్పే విద్యుత్‌కాంతుల నడుమ కోలాటాలు, పులివేషాలు, చిటికెల భజనలు తదితర కార్యక్రమాలు ప్రజల్ని ఆకట్టుకుంటాయన్నారు. ఆర్కెస్ట్రా, డ్యాన్ బేబీ డ్యాన్స్, డూప్స్ బాబోయ్ డూప్స్, సారంగధర చౌచౌ, కొండకొవ్వాక వారిచే బాణసంచా విన్యాసాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

శివరాత్రి ఉత్సవాల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం

మాడుగుల: మండలంలోని ఎం.కోడూరులో ఈ నెల 18న జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల వాల్ పోస్టర్‌ను తారువలో తన క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు బుధవారం విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ సీహెచ్.వి.మూర్తి, పడాల అప్పలనాయుడు, గొల్లవెల్లి రాజేష్, జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలచెంచమ్మ తల్లి తీర్థం



అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

రావికమతం: ప్రసిద్ధి చెందిన గర్నికం బాలచెంచమ్మతల్లి తీర్థం బుధవారం ఘనంగా జరిగింది. ముందెన్నడూ లేని విధంగా ఈసారి వేలాదిగా భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా అమ్మవారిని ఈ ప్రాంతీయులు కొలుస్తారు. చీరెలు, కొబ్బరికాయలు ,అరటిగెలలు, చెరకు, ధాన్యం మూటలు, బెల్లం దిమ్మలు సమర్పించుకున్నారు. భక్తులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. రావికమతం, కొత్తకోట ఎస్‌ఐలు, సిబ్బందితో పాటు ఉత్సవ కమిటీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వలంటీర్లు బందోబస్తు నిర్వహించారు. తీర్థం సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ దీపాలంకరణ ఆకట్టుకుంది. జెయింట్‌వీల్, రైలు మార్గం, సర్కస్ వంటివి ఏర్పాటు చేయడంతో పిల్లలకు వినోదాన్ని పంచాయి.ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో నేలకు సారం

• తారువలో అవగాహన ర్యాలీ



ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహిస్తున్న ఏపీసీఎన్‌ఎఫ్ సిబ్బంది

దేవరాపల్లి: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటల దిగుబడి రావడంతో పాటు నేల సారవంతం అవుతుందని ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్(ఏపీఎస్‌ఎఫ్) మాస్టర్ ట్రైనర్లు బి. అప్పలరాజు, పి.నాగమణి అన్నారు. తారువలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ పంటల సాగుకు ముందు 12 కిలోల 30 రకాల విత్తనాలను పొలంలో జల్లి 45 రోజుల తర్వాత భూమిలో కలియదున్నడం ద్వారా భూమికి అవసరమైన పోషకాలు లభించి, సారవంతం అవుతుందన్నారు. తద్వారా ఖరీఫ్ దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని చెప్పారు. ఈ విధానంతో ద్వారా ఆరోగ్యకర పంటలతో పాటు నేల తల్లి సారవంతం అవుతుందని స్థానిక రైతులకు వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్‌ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జ్‌లు ఎల్.కృష్ణవేణి, ఎస్.ఎం. నాయుడు, సీఆర్‌పీ శ్రీదేవి తదితర్లు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ వర్తించని వారికి సీఎంఆర్‌ఎఫ్



ఎర్రాపాత్రుడుకి చెక్కును అందిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

కె.కోటపాడు : ఆరోగ్యశ్రీ పథకం వర్తించని పేదలు మెరుగైన వైద్యం పొందేందుకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా నిధులు మంజూరు చేస్తున్నట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు తెలిపారు. ఆర్లి గ్రామానికి చెందిన బొాెం ఎర్రాపాత్రుడు ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆరోగ్యశ్రీ పథకం వర్తించకపోవడంతో సీఎం సహాయనిధిని మంజూరు చేశారు. రూ.44వేల చెక్కును కె.కోటపాడులో బుధవారం డిప్యూటీ సీఎం అందజేశారు.

ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ మంచి మనసుతో సీఎం వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ప్రజలకు సుపరిపాలనను అందిస్తున్నారని చెప్పారు. అనంతరం ఎర్రాపాత్రుడు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడుకు కృతజ్ఞతలను తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, మాజీ సర్పంచ్ బొాెం కృష్ణారావు, చిరికి ప్రసాద్, లెక్కల గోపి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు



బోరును ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటరమణ

నాతవరం: వేసవిలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని పెదగొలుగొండపేట సర్పంచ్ మిరపల వెంకటరమణ తెలిపారు. గ్రామంలోని జగనన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన బోరును బుధవారం ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేసేందుకు పనులు చేపట్టినట్టు చెప్పారు. జగనన్న లేఅవుట్‌లో ఇళ్లు నిర్మించుకునే వారికి వేసవిలో నీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీను, ఆర్‌డబ్ల్యూఎస్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో ప్రాక్టీస్ పీరియడ్ నిర్వహించాలి



నక్కపల్లి బాలికల పాఠశాలలలో లిప్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

నక్కపల్లి : సమగ్ర శిక్ష అభయాన్ అమరావతి, ఎస్‌సీఆర్‌ఈటి వారి ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న లిప్(లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) అమలు తీరును పరిశీలించేందుకు ముగ్గురు సభ్యులు గల రాష్ట్ర బృందం బుధవారం నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించింది. ఈ బృందంలో సభ్యులైన డైట్‌లెక్చరర్ జీజీఎస్ నాగేశ్వరరావు, నాగలక్ష్మి , డేవిడ్ రాజులు మాట్లాడుతూ ఉపాధ్యాయులు టీచింగ్ పీరియడ్‌తోపాటు ప్రాక్టీస్ పీరియడ్‌ను కూడా నిర్వహిస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఈనెల 14నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో లిప్ కార్యక్రమంపై పరిశీలన చేస్తున్నామన్నారు. విద్యార్థుల అభ్యసనా స్థాయిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో తూర్పుగోదావరి జిల్లా నోడల్ అధికారి ఆర్.వి.గిరి, ఎంఈవో డీవీడీ ప్రసాద్ పాల్గొన్నారు.